అద్దె ఇళ్లు.. అరకొర వసతులు

- అసౌకర్యాల మధ్య అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ
- ఇబ్బందులు పడుతున్న చిన్నారులు, సిబ్బంది
- సొంత భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి


ధూళికట్టలో అద్దె ఇంటిలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

ఎలిగేడు: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించి వారికి సంపూర్ణ ఆరోగ్య వంతులు చేస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు అసౌర్యాలతో నడుస్తున్నాయి. అంగన్‌వాడీలకు సొంత భవనాలు లేక అద్దె ఇళ్లలో , భవనాలు ఉన్నా.. సరైన సౌకర్యాలు లేక అరకొర వసతులతో చిన్నారులు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. ఎలిగేడు మండలంలోని పలు అంగన్ వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక అద్దె ఇళ్లలో కొనసాగుతున్నాయి. కనీస వసతులు కరువై చిన్నారులు, అంగన్‌వాడీ టీచర్లు అవస్థలు పడుతున్నారు. వాటిలో సరైన సౌకర్యాలు లేక చిన్నారులను పంపించేందుకు తల్లిదండ్రులు విముఖత చూపుతున్నారు. ఏళ్ల నుంచి కొన్ని కేంద్రాలు అరకొర వసతులతో కూడిన అద్దె ఇళ్లలో కొనసాగుతున్నాయి.

అద్దె భవనాల్లో 6 కేంద్రాలు

మండలంలోని 12 గ్రామాల్లో 25 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, పలు ప్రాథమిక పాఠశాలలు, పాత జీపీ కార్యాలయాల్లో 6 కేంద్రాలు అద్దె లేకుండా కొనసాగుతుండగా, 13 కేంద్రాలకు పక్కాభవనాలు ఉన్నాయి. మరో 6 కేంద్రాలు అద్దె ఇళ్లలో కొనసాగుతున్నాయి.

కేంద్రాల్లో అరకొర వసతులు..

గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు కనీసం రూ.2000 చెల్లిస్తేనే ఓ మోస్తారు వసతులు ఉన్న ఇళ్లు కిరాయికి లభించలేని పరిస్థితి. అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్న అద్దె ఇంటికి చెల్లిస్తున్న కిరాయి రూ.వెయ్యి మాత్రమే. ఇవి కూడా నెల, నెలా సక్రమంగా ఇవ్వకపోవడంతో ఇంటి యజమానుల నుంచి ఇబ్బందులు తప్పడంలేదని అంగన్‌వాడీ టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పక్కా భవనాల కోసం విజ్ఞప్తి..

అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై ప్రభుత్వం ఇటీవల పటిష్టమైన చర్యలు చేపట్టి ఆన్‌లైన్ విధానానికి శ్రీకారం చుట్టింది. దీంతో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు విధుల్లో అంకితభావంతో పనిచేస్తూ సమయ పాలన పాటిస్తున్నారు. కేంద్రాల్లో ఇంగ్లిష్ మీడియం విద్యాబోధన అమలు చేయడంతోపాటు పోషకాహారం అందించడానికి చర్యలు చేపట్టింది. కేంద్రాలలో చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోధన జరుగుతున్నప్పటికీ వసతులు సక్రమంగా లేక చిన్నారులను పంపించేందుకు వారి తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. వసతులు లేని కారణంతో చిన్నారులను వారి తల్లిదండ్రులు ప్రైవేట్ స్కూళ్లకు పంపిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాలని కోరుతున్నారు. సొంత భవనాల్లో సౌకర్యాలు లేవని, ఫ్యాన్లు లేకపోవడంతో వేసవిలో చిన్నారులు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారని, కరెంట్ సౌకర్యంతోపాటు ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని, టాయ్‌లెట్లు నిర్మించాలని, అన్ని సౌకర్యాలు కల్పించాలని అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వానికి ఉన్నతాధికారులకు నివేదించాం. సొంత భవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించేందుకు నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించాం. సొంత భవనాలు ఉన్న చోట కరెంట్, ఫ్యాన్ల ఏర్పాటు కోసం, టాయ్‌లెట్లు రిపేర్ చేయించడం కోసం ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాం. – సూర్యకళ
ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఎలిగేడు

బీజేపీ దాడులు సరికాదు

జ్యోతినగర్: త్రిపుర రాష్ట్రంలో ఎన్నికల తర్వాత జరిగిన హింసాకాండ ప్రభావిత ప్రాంతాలను సందర్శించేందుకు వెళ్లిన ప్రతిపక్ష ఎంపీల బృందంపై బీజేపీ కార్యకర్తలు దాడికి పాల్పడటం దుర్మార్గమైన చర్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఏ.ముత్యంరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. వామపక్ష, కాంగ్రెస్ మద్దతుదారులపై దాడులు పెరిగాయని, సీపీఎం ఎమ్మెల్యేల ఇళ్లలో చొరబడి సామగ్రిని ధ్వంసం చేసినా అధికారంలో ఉన్న బీజేపీ ఎవరినీ అరెస్టు చేయకపోవడం విడ్డూరమని విమర్శించారు. సమావేశంలో డివిజన్ శాఖ అధ్యక్షుడు రవీందర్ రామాచారి, జిల్లా కమిటీ సభ్యులు ఎన్.శంకర్, గీట్ల లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శంకర్, సాంబయ్య, దేవేంద్ర పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పెద్దపల్లిరూరల్: యువత పాన్, గుట్కా, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జాతీయ యువజన అవార్డు గ్రహీత కొండ రవి పేర్కొన్నారు. మంగళవారం పెద్దపల్లి మండలం రాఘవపూర్‌లోని గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ జాతీయసేవా పథకంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత స్వామివివేకానంద అడుగుజాడల్లో నడవాలని, సామాజిక సేవా కార్యక్రమాలను అలవర్చుకోవాలన్నారు. మధ్యాహ్నం జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ అల్లెంకి శ్రీనివాస్, ఎంపీటీసీ శ్రీనివాస్, వార్డుసభ్యులు శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సమద్, అధ్యాపకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి


ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఎలిగేడు: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్, ఎస్‌డీఎఫ్, జీపీ నిధులు రూ.26లక్షలతో సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం, ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి పోచమ్మ ఆలయం వరకు సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. మండల కేంద్రంలో గతంలో 12 ఫీట్ల రోడ్డు ఇరుకుగా ఉండేదని, సర్పంచ్ సింధూజ గ్రామస్తులను ఒప్పించి 24 ఫీట్ల రోడ్డుగా మార్చారని తెలిపారు. 9 ఏళ్లలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు మాటలకు మాత్రమే ఉన్నారన్నారు.

ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ

ప్రభుత్వ స్థలాల్లో 58 జీవో ప్రకారం ఆయా గ్రామాల్లో గుడిసెలు, ఆవాసం ఏర్పరచుకుని నివాసం ఉంటున్న వారికి ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేస్తుందని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ముప్పిరితోట, ఎలిగేడు, రాములపల్లి, ర్యాకల్‌దేవుపల్లి గ్రామాలకు చెందిన నలుగురికి ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. సొంత స్థలంలో ఇళ్లు నిర్మించుకునే పేదలకు పెద్దపల్లి నియోజకవర్గానికి 3 వేల ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అనంతరం మండలంలోని ధూళికట్టలో జరుగుతున్న సీఎం కేసీఆర్ కప్ టోర్నీలో విజేతగా నిలిచిన ముప్పిరితోట జట్టు, రన్నర్‌గా నిలిచిన లోకపేట జట్లకు నగదు బహుమతి, కప్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తానిపర్తి స్రవంతి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక, సింగిల్‌విండో చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్ భూర్ల సింధూజ, గొల్లే కావేరి, పెద్దోళ్ల ఐలయ్య, దేవరనేని ప్రభావతి, విజయేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, బీఆర్ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య మేళాతో వ్యాధులపై అవగాహన


బంజేరుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

జూలపల్లి: గ్రామాలలో నిర్వహించే ఆరోగ్య మేళాలతో వ్యాధులపై అవగాహన పెరుగుతుందని మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి అన్నారు. మండలంలోని తేలుకుంట, వడ్కాపూర్ వెంకట్రావుపల్లె ఆరోగ్య ఉపకేంద్రాల పరిధిలో గ్రామస్తులకు వ్యాధుల పై అవగాహన కల్పించారు. నిక్షయ్ పోషణ యోజన గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పద్మ శ్యాం,తిరుపతి,,సీహెచ్‌వో కలీం మొద్దీన్, హెచ్వీ వసంత, అనంతరావ్, ఏఎన్ఎంలు ఉన్నారు.

ధర్మారం: మండలంలోని బంజేరుపల్లి తండాలో మంగళవారం మేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నార్ల అనుదీప్ ఆధ్వర్యంలో క్షయవ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో పాటు గ్రామ యువకులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో సర్పంచ్ భూక్యచంద్రానాయక్, ఎంపీటీసీ భూక్య సరిత, డాక్టర్ గౌతం, హెచ్ఈవో రాజిరెడ్డి, ఏఎన్ఎం స్వరూప, పంచాయితీ కార్యదర్శి సుమలత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం ముస్త్యాలలో బేగంపేట్ పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ చంద్రశేఖర్ మంగళవారం ప్రజలకు క్షయ వ్యాధి పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా క్షయ వ్యాధి లక్షణాలు, పరీక్షలు, సంబంధించిన మందుల ఉపయోగించే విధానాలు గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ లావణ్య, ముస్త్యాల ఆరోగ్య ఉప కేంద్రం వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

టీబీ వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పాటించాలి

ఎలిగేడు: టీబీ వ్యాధిగ్రస్తులు తగు జాగ్రత్తలు పాటించి, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మండల వైద్యాధికారి నిస్సీక్రిస్టీనా అన్నారు. మండలంలోని ధూళికట్ట, సుల్తాన్‌పూర్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో మంగళవారం టీబీపై అవగాహన ర్యాలీ చేపట్టారు. మందులు సక్రమంగా వాడటం, పోషకాహార నియమాలు తీసుకోవల్సిన జాగ్రత్తలు వారికి ప్రభుత్వం కల్పిస్తున్న(ఎన్‌పీవై) నిక్షయ్ పోషణ యోజన గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచులు గొల్లే కావేరి, అర్షనపల్లి వెంకటేశ్వర్ రావు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఊరెళ్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి

యైటింక్లయిన్‌కాలనీ: కుటుంబంతో సహా ఎవరైనా ఊరికి వెళితే ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని గోదావరిఖని టూటౌన్ పోలీసులు కోరారు. మంగళవారం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి యైటింక్లయిన్‌కాలనీ, పాతన కాలనీ, చుట్టుపక్కల గ్రామాల్లో టూటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. వేసవికాలంలో చాలామంది గ్రామాలకు వెళ్తే దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశాలు ఉన్నాయని, ఇ విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలు బ్యాంకు లాకర్లో పెట్టుకోవాలని సూచించారు. అనుమానితులు ఎవరైనా సంచరిస్తే 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో టూటౌన్ ఎస్సై శ్యామ్ పటేల్, సిబ్బంది పాల్గొన్నారు.

దొంగల సంచారంపై పోలీసుల ప్రచారం

మంథని: మంథని ప్రాంతంలో దొంగలు సంచరిస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు మైక్‌లు, సోషల్ మీడియాలో ప్రచారం నిర్వహిస్తున్నారు. విలువైన అభరణాలు ఇంట్లో ఉంచుకోకుండా జాగ్రత్త తీసుకోవాలని, ఇళ్లు విడిచి వేరే ప్రాంతాలకు వెళ్తే ఇంట్లో విలువైన బంగారం ఇతర విలువైన ఆభరణాలు ఉంచుకోరాదని విజ్ఞప్తి చేస్తున్నారు. తమకు సమాచారం అందిస్తే అలాంటి ఇళ్ల వద్ద నిఘా ఉంచుతామని పోలీసులు ప్రచారం చేస్తున్నారు. కాగా గత కొంత కాలంగా దొంగతనాలు పెరిగిపోవడంతో మంథని ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తాళం వేసిన ఇండ్లను దొంగలు టార్గెట్ చేస్తుండడంతో ఇళ్లు విడిచి వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు.

విద్యార్థులు పక్కా ప్రణాళికతో విజయం సాధించాలి

గోదావరిఖని: విద్యార్థులు సరైన ప్రణాళికతో చదివి పరీక్షల్లో విజయం సాధించాలని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్ అన్నారు. గోదావరిఖని ప్రశాంత్‌నగర్‌లోని గురుకుల పాఠశాలలో సోమవారం రాత్రి 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు,వార్షికోత్సవం నిర్వహించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా గురుకులాలు అత్యధిక ఉత్తీర్ణతను సాధిస్తున్నాయన్నారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు, ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ రజిత, వైద్యులు డాక్టర్ క్యాస శ్రీనివాస్, ఏటీపీ అనిత, పీఈటీ వెంకటేష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత


విద్యార్థులకు పరీక్షాప్యాడ్స్ అందిస్తున్న హరీశ్

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు మంగళవారం అల్లంకి భూలక్ష్మి జ్ఞాపకార్థం కుమారుడు హరీశ్ కుమార్ పరీక్ష సామగ్రిని అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం మాధవీలత, వాసవీ క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రామిడి రవీందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమతి లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని ప్రశాంత్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్ అనుమతి లేకున్నా సీబీఎస్ఈ పేరిట తప్పుడు ప్రకటన చేసి తల్లిదండ్రులను మోసం చేస్తోందని, ఆ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని రామగుండం ఎంఈవోకు ఫిర్యాదు చేసినట్లు డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కొంటు సాగర్ తెలిపారు. సదరు ప్రైవేటు స్కూల్ యాజమాన్యం రూ.వేలాదిగా ఫీజులు వసూలు చేస్తోందని ఆరోపించారు. ఆయన వెంట డీవైఎఫ్ఐ ఈస్ట్ ఏరియా కన్వీనర్ చంద్రగిరి కృష్ణకుమార్, కోకన్వీనర్ మొగిలిచర్ల సురేశ్ ఉన్నారు.

వికలాంగుడికి వీల్ చైర్ అందజేత

ఓదెల: ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన రత్నాకర్‌రావు అనే వికలాంగుడికి ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పరికిపండ్ల నరహరి(ఐఎఎస్) సూచన మేరకు ఓదెల తహసీల్దార్ కత్రోజు రమేశ్ సహకారంతో ఫౌండేషన్ సభ్యులు డిప్యూటీ సీఈవో మిట్టపల్లి రాజేందర్, కీర్తి నాగార్జున వీల్‌చైర్ అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ బండ రాజేందర్, జూనియర్ అసిస్టెంట్ అనిల్ పాల్గొన్నారు.

రవాణా ట్యాక్స్ చెల్లించని వాహనాలు సీజ్

ధర్మారం: రవాణా ట్యాక్స్ చెల్లించని వాహనాలను సీజ్ చేస్తామని, వాహనదారులు తమ వాహనాలకు విధిగా ట్యాక్స్‌లు చెల్లించాలని పెద్దపల్లి అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మధు సూచించారు. పెండింగ్ రవాణా ట్యాక్స్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ధర్మారంలో వాహనదారులకు అవగాహన కల్పించారు. గూడ్స్ వాహనదారులు తమ రవాణా ట్యాక్స్‌లను సకాలంలో చెల్లించాలని సూచించారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లిస్తే 50 శాతం సబ్సిడీ అవకాశం కల్పిస్తామని తెలిపారు. అలా చెల్లించని వారు అధికారులకు పట్టుబడితే 200 శాతం పెనాల్టీతో ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని: రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రామగుండం నియోజకవర్గం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం తేదీలు, సమన్వయకర్తలను ప్రకటించారు. నియోజకవర్గంలోని మండలాల పరిధి, పట్టణాల్లో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 19న యైటింక్లయిన్‌కాలనీ, 21న ఫైవింక్లయిన్‌లో, 24న లక్ష్మీనగర్‌లో, 26న పాలకుర్తి , 27న ఎన్టీపీసీ, 28న గంగానగర్ , 29న అంతర్గాం, 31న ఎల్బీనగర్‌లో ఏప్రిల్ 1న గౌతమినగర్‌లో, 2న హనుమాన్‌నగర్‌లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించనున్నామన్నారు. సమ్మేళనానికి సమన్వయకర్తలను నియమించారు.

పాఠశాల అదనపు తరగతి గదులు ప్రారంభం

గోదావరిఖనిటౌన్: మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ స్థానిక 5 ఇంక్లయిన్ ప్రభుత్వ పాఠశాలలో నూతన అదనపు గదులను మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో రామగుండం మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చందర్

బలగం నటి సుజాతకు సన్మానం

గోదావరిఖనికి చెందిన కళాకారులు బుల్లితెర నుంచి వెండితెరకు ఎదగడం అభినందనీయమని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. మంగళవారం రాత్రి స్థానిక రాజేశ్ థియేటర్‌లో ప్రదర్శిస్తున్న బలగం సినిమాను కళాకారులు, ప్రేక్షకులతో కలిసి వీక్షించారు. అనంతరం బలగం నటి, గోదావరిఖని సీతానగర్‌కు చెందిన కొమ్ము సుజాతను ఎమ్మెల్యే చందర్, నాయకులతో కలిసి సన్మానించారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలం గుంటూరుపల్లిలో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మంగళవారం కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుంటూరుపల్లి సర్పంచ్ పసుపుల నాగలక్ష్మి, నాయకులు రాగం శ్రీనివాస్, పల్లె శ్రీనివాస్, చిలుముల నాగరాజు, ఆడెపు రాజేశ్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి


హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

రామగుండం: నేటి నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ మీడియట్ పరీక్షలకు రామగుండం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు చేశారు. మంగళవారం విద్యార్థుల హాల్ టికెట్ నంబర్ల వారీగా సీట్లను కేటాయించారు. ప్రథమ సంవత్సరం-241, ద్వితీయ సంవత్సరం-266 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

జూలపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు పెద్దాపూర్‌లోని ఆదర్శ పాఠశాల,కళాశాలలో ఇంటర్ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్లు సుధాకర్, పద్మశ్రీ తెలిపారు.

రామగిరి: ముత్తారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేటి నుంచి జరగనున్న ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరిండెంట్ ఎల్ఎన్ రావు తెలిపారు.

సుల్తానాబాద్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీవాణి జూనియర్ కళాశాలలో నిర్వహించనున్న ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీవో, ఈఎస్ లు ప్రభాకర్, రమేశ్, కిషన్, అశోక్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 392 మంది విద్యార్థులు, శ్రీవాణి జూనియర్ కళాశాలలో 328 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ విధించారు.

మంథనికి రూ.5 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులు

మంథని: మంథని డివిజన్‌కు డీఎంఎఫ్‌టీ నిధులు రూ. 5 కోట్లు మంజూరయ్యాయి. జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు ప్రతిపాదనల మేరకు రూ. 4 కోట్లు, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు సూచించిన పనులకు కోటి రూపాయల నిధులు మంజూరైనట్లు ఇరువురు ప్రకటించుకున్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు ప్రతిపాదనలకు రూ.4 కోట్ల మంజూరు కాగా, మండలాల్లో పలు అభివృద్ధి పనులకు కోటి రూపాయలు మంజూరైనట్లు ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు తెలిపారు. మంథనిలో అంబేడ్కర్ భవన్, అయ్యప్పస్వామి టెంపుల్ కమ్యూనిటీ హాల్‌కు రూ.10 లక్షల చొప్పున మంజూరయ్యాయి, అలాగే ఆయా మండలాల్లో సిమెంట్ రోడ్లు, దేవాలయాల అభివృద్ధి, సెంట్రల్ లైటింగ్ కు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎస్‌డిఎఫ్ కింద అడవిసోమన్‌పల్లి, గుంజపడుగు, ముత్తారం గ్రామాలకు వైకుంఠ రథాలు, ఫీజర్లకు రూ.30 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు.

ఘనంగా శ్రీరేణుకాఎల్లమ్మ బోనాలు


బోనాలతో ఆలయానికి వస్తున్న గ్రామస్తులు

రామగిరి: మండలంలోని రత్నాపూర్, కల్వచర్లలో మంగళవారం గౌడ సంఘాల ఆధ్వర్యంలో శ్రీరేణుకాఎల్లమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య మహిళలు బోనం కుండలు నెత్తిన ఎత్తుకొని గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. బోనాలతో శ్రీరేణుకాఎల్లమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించారు. మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ, సర్పంచ్‌లు పల్లె ప్రతిమ, గంట పద్మ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి నిమిత్తం సర్పంచ్ ప్రతిమ రూ. 5,016లు విరాళంగా గౌడ సంఘ సభ్యులకు అందచేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణా రెడ్డి, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిన్నారులకు అడిషనల్ కలెక్టర్ అభినందన


చిన్నారులను అభినందిస్తున్న అడిషనల్ కలెక్టర్

పెద్దపల్లిరూరల్: ఈనెల 12న వేములవాడలో నిర్వహించిన మూడో ఇంటర్ స్టేట్ ఓపెన్ కరాటే పోటీల్లో కటా విభాగంలో 12 ఏళ్ల లోపు విభాగంలో బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించిన నోబెల్ పాఠశాల విద్యార్థులను అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ కలెక్టరేట్‌లో మంగళవారం అభినందించారు. క్రీడలతో పాటు చదువులోనూ రాణించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ లక్ష్మణ్, విద్యార్థులుపాల్గొన్నారు.

ప్రజల సౌకర్యార్థమే వారసంత


వారసంత ప్రారంభిస్తున్న ఎంపీపీ

కమాన్‌పూర్: మండలంలోని గుండారంలో ప్రతి మంగళవారం నిర్వహించే వారసంతను మంగళవారం ఎంపీపీ రాసకొండ లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామ ప్రజల సౌకర్యం కోసమే గ్రామంలో వారసంతను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు, వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆకుల ఓదెలు, ఉప సర్పంచ్ రాసకొండ చంద్రమౌళి, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, ప్రజలు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దుకోవాలి


అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ బాలాజీరావు


సుల్తానాబాద్‌రూరల్: ప్రజలందరూ ఏక తాటిపైకి వచ్చి స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దుకోవాలని ఎంపీపీ బాలాజీరావు అన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా మంగళవారం సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లిలో ఎంపీడీవో శశికళతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశీలించిన అనంతరం గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్వచ్ఛ గ్రామం కోసం ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రావణ్, సంబంధిత అధికారులు, పాలకవర్గ సభ్యులు ఉన్నారు.

ఉపసర్పంచ్‌పై నెగ్గిన అవిశ్వాసం


అవిశ్వాసానికి చేతులెత్తిన వార్డుసభ్యులు

పాలకుర్తి: మండలంలోని బామ్లానాయక్‌తండా ఉపసర్పంచ్ బదావత్ జ్యోతిపై వార్డుసభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఫిబ్రవరి 16న ఆరుగురు వార్డు సభ్యులు ఉప సర్పంచ్‌పై అవిశ్వాసాన్ని ప్రకటిస్తూ పెద్దపల్లి ఆర్డీవోకు లిఖితపూర్వకంగా అవిశ్వాస తీర్మానం నోటీస్ అందించారు. దీంతో మంగళవారం పంచాయతీ కార్యాలయంలో ఆర్డీవో వెంకటమాధవరావు సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఇందులో ఆరుగురు సభ్యులు ఉప సర్పంచ్‌కు వ్యతిరేకంగా చేతులెత్తారు. దీంతో అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీవో ప్రకటించారు. సర్పంచ్ బదావత్ రాజునాయక్, తహసీల్దార్ సునీత, ఎంపీడీవో లలిత, ఎంపీవో షబ్బీర్‌పాషా ఉన్నారు.

మిర్చి తిని.. చాయ్ తాగి..



మంథని: ఎన్నికల వాతావరణం మొదలుకావడంతో నియోజకవర్గస్థాయిలో ఆయా పార్టీల నాయకులు ప్రజలను మచ్చిక చేసుకునే పనిలో పడ్డారు. మంథని మండలం అడవిసోమన్‌పల్లి స్టేజీ వద్ద మంగళవారం ఓ హోటల్‌లో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు మిర్చి తిని, చాయ్ తాగుతూ స్థానికులతో ముచ్చటించారు.